# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు.. వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**
4. **రైతులు అధిక ఆదాయం వచ్చే ఉద్యానవన పంటల సాగుకు మొగ్గుచూపాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.**
5. **హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని 299 చెరువులను కృష్ణా జలాలతో నింపామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు.. వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన ఒప్పందంపై ప్రధాన మంత్రితో ఆ సంస్థ సి.ఇ.ఓ. సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టుకు ప్రధాన మంత్రి స్పందించారు. ఈ ఎ.ఐ. హబ్ ఒక బలమైన శక్తిగా పని చేస్తుందని, దీని ద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని, గ్లోబల్ టెక్నాలజీకి కేంద్రంగా భారత స్థానం మరింత పటిష్టమవుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు దేశ ఐటీ చరిత్రలో కీలక మలుపుగా పేర్కొన్నారు. ఢిల్లీలో గూగుల్ సంస్థ నిన్న నిర్వహించిన భారత్ ఎఐ శక్తి సదస్సులో పాల్గొన్న అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రికి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ డాటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం,

వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని అన్నారు. ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గూగూల్ ఏ.ఐ హబ్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ విశేషంగా కృషి చేశారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. గూగుల్ తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఒప్పందం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ అంశంపై ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్...27 సెకన్లు)

---------------------------

రైతులు అధిక ఆదాయం వచ్చే నూనె గింజలు, ఆయిల్ పామ్, ఇతర ఉద్యానవన పంటల సాగుకు మొగ్గుచూపాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాదులోని సచివాలయంలో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు నూరు శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్‌లో అంతర పంటలు వేసి తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ నూనే గింజల పథకాన్ని 66 కోట్ల 67లక్షల రూపాయల వ్యయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఈ అంశంపై అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 16 చిత్తడి నేలలను గుర్తించి, వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున చిత్తడి నేలలను గుర్తించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించనుందని పేర్కొన్నారు.

---------------------------

హంద్రీనీవా ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని 517 చెరువులకు గాను 299 చెరువులని కృష్ణా జలాలతో నింపామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. అనంతనం ఆయన మాట్లాడుతూ.. కాలువ చివరి ప్రాంతమైన కుప్పం వరకు కృష్ణాజలాలు తరలింపును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భగా చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు కె.అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, వై.సత్యకుమార్ యాదవ్‌లు నిన్న పరిశీలించారు. రేపు

జరగనున్న సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 26 సెకన్లు

---------------------------

దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించే వ్యాపారస్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. నిబంధనలను పాటించకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. విజయవాడలోని భవానీపురంలో టపాసుల గోదాములు, విక్రయ ప్రదేశాలను కలెక్టర్ నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరిగిన భారత్, వెస్టిండీస్ క్రికెట్ రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్ లో 2–0 తేడాతో భారత్ సీరీస్ ను కైవశం చేసుకుంది. ఈ టెస్ట్ సిరీస్ విజయంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ లో భారత్ విజయాల శాతాన్ని 61.90 పాయింట్లకు పెంచుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు  కురిసే  అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

======================